

17, 18 తేదీల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

చీరలపై స్క్రీన్ ప్రింటింగ్ డిజైన్ వర్క్‌పై భీమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయివేటు శిక్షణ కేంద్రాల్లో ఈ శిక్షణకు సుమారు రూ.5 వేలు వరకు ఖర్చు అవుతుందన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల పోరుబాట

- నేటి నుంచి ఉద్యమానికి శ్రీకారం
- సమస్యల పరిష్కారానికి కార్యాచరణ
- విద్యుత్ సంస్థల నిర్వీర్యం
- ప్రయివేటు కంపెనీల దోపిడీపై సమరం



విద్యుత్ ఉద్యోగుల ఆందోళన (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యుత్ రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు పోరు బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సిద్ధమయ్యారు. విద్యుత్ సంస్థల నిర్వీర్యం, ప్రయివేటు కంపెనీల ఇష్టారాజ్యంపై గళమెత్తుతున్నారు. బుధవారం నుంచి సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే అన్ని రకాల ఉద్యోగులు కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే బోధనేతర పనులు వద్దు, బోధన పనులకే తమను పరిమితం చేయాలంటూ ఆందోళన సాగిస్తున్నారు. మరోవైపు వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం కనీస వేతనాలు, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

జిల్లాలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో షిఫ్ట్ ఆపరేటర్లుగా, ఎమర్జెన్సీ విభాగంలో పీక్ లోడ్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్లుగా, అటెండర్, స్వీపర్ కం గార్డెన్స్‌గా సుమారు 250 మంది పని చేస్తున్నారు. అలాగే ఎఇ, సబ్ ఇంజనీర్, ఫోర్ మేన్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్, అసిస్టెంట్ లైన్‌మ్యాన్, జూనియర్ లైన్‌మ్యాన్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్లుగా దాదాపు 500 మంది రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

మాట మార్చిన సర్కార్

వైసిపి పాలనలో 2022 పిఆర్‌సిలో ఉద్యోగులకు 8 శాతం మాత్రమే ఇచ్చి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ ఉద్యోగుల ఊసే లేకుండా తీవ్ర అన్యాయం చేసింది. ఫలితంగా నారా లోకేష్ పాదయాత్రలో కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అనాటి వైసిపి ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటుతున్నా రెగ్యులరైజేషన్ గురించి గాని, డిఎలు, పాతపెన్షన్, జెఎల్ఎం గ్రేడ్ 2ల సమస్యల ప్రస్తావనే లేదు. అనేకసార్లు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని, లోకేష్‌ను కలిసినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం 2022 పిఆర్‌సి, ఎరియర్స్ కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఒకే పని చేస్తున్న వారికి వేర్వేరుగా వేతనాలు ఇచ్చి తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారు.

పోరాటాలపై అణచివేత

ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటాలపై అణచివేత ధోరణితో వ్యవహరిస్తోందని పలువురు ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022 పిఆర్‌సి ఒప్పందంలోకాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం గురించి, ఒకే పనిచేసే వారికి ఒకే వేతనం, అన్లిమిటెడ్ వైద్య సదుపాయం, కోటి రూపాయల నష్టపరిహారం తదితర అంశాలు, ఉద్యోగులకు పిఆర్‌సి 8 శాతం ఇవ్వడంపై జెఎల్ఎం గ్రేడ్-2 లకు సర్వీస్ రూల్స్ గురించి ఎటువంటి స్పష్టమైన హామీని నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీగా ఏర్పడి విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నారు. ప్రయివేటీకరణలో భాగంగానే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, నాన్ రెగ్యులర్ ఉద్యోగులను ఐక్యంగా కార్యాచరణను సాగిస్తున్నారు. జెఎసి ఇచ్చిన పిలుపునకు విధానపరమైన అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నా తాము అక్టోబర్ 14న వర్క్ టూ రూల్, 15 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు.

ఇవీ డిమాండ్లు

కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలనే వారు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు 2022 పిఆర్‌సి ఎరియర్స్, మీటర్ రీడర్స్, బిల్ కలెక్టర్స్, స్టోర్ హమాలీలు వంటి పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ఏళ్ల తరబడి విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ఇప్పటికే అనేకసార్లు వీటి పరిష్కారం కోసం వినతి పత్రాలు అందజేశాము. ఆందోళన చేశాము. అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. అందుకే ఈ నెల 15 నుంచి సమ్మె బాట పట్టాము.

-వి.బాలకుమార్, విద్యుత్ ఉద్యోగి, కాకినాడ

రెగ్యులర్ చేయాలి



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులర్ చేయాలి. సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం ఇవ్వాలి. 22 పిఆర్‌సి ఎరియర్స్ ఇవ్వాలి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరికి అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ 10 లక్షలు ఇవ్వాలి.

-సిహెచ్.రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి

సెజ్ భూములకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

ప్రజాశక్తి - కాకినాడ

కెఎస్ఇజెడ్ భూములు రైతుల పేరున బదిలీ ప్రక్రియకు సంబంధించి ఎపి ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెఎస్ఇజెడ్ రైతులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. కెఎస్ఇజెడ్ లిమిటెడ్ ద్వారా రైతులకు బదిలీ చేయాల్సిన 2,180 ఎకరాల భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్ 9(1)(ఎ), 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలు చేయబడుతుందని అన్నారు. ఈ మినహాయింపు కేవలం రైతుల పక్షాన జరిగే భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. డెవలపర్లు, యూనిట్లు లేదా స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఇజెడ్) అభివృద్ధి కార్యక్రమాల కోసం జరిగే లావాదేవీలకు మాత్రం ఈ మినహాయింపు వర్తించదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రభుత్వంపై నమ్మకం పెంచే సానుకూల చర్యగా నిలుస్తుందని అన్నారు. రైతులు తమ భూముల బదిలీ ప్రక్రియలో ఈ మినహాయింపు నిబంధనలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సిఐటియు జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 25, 26 తేదీల్లో పెద్దాపురం పట్టణంలో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా 12వ మహాసభల కరపత్రాన్ని సంఘం నాయకులు ఆవిష్కరించారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సమస్యలపై సిఐటియు నికరంగా పోరాడుతుందన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్ వర్కర్లను ఐక్యంగా నిలపడంలో సిఐటియు అగ్రభాగాన ఉంటుందన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో పెద్దాపురంలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, పాండవగిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వడ్డీ సత్యనారాయణ, గునురి రమణ, మరిడమ్మ తల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తైనాల శ్రీను, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మ, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడిశెట్టి గంగ, సిఐటియు నాయకులు సిరిపరపు శ్రీనివాస్, జి.పెంటయ్య పాల్గొన్నారు.

3వ శుక్రవారం ఉద్యోగుల పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతీ నెల 3వ శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. అధికారులందరూ 17వ తేదీ మధ్యాహ్నం 3.45 గంటలకు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌కు చేరుకోవాలన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సిఐటియు నూతన కార్యవర్గంతో సత్తిరాజు

ప్రజాశక్తి - కోటనందూరు

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీనియర్ నాయకులు కె.సత్తిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పరిరక్షించుకునేందుకు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కన్వీనర్‌గా ఎస్‌కె.పద్మ, కో కన్వీనర్‌గా ముక్కుడుపల్లి బాబారావులతో కలిపి 18 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 9 కార్మిక రంగాలకు చెందిన కార్మికులు రవణమ్మ, పద్మ, లీల, లోవకుమారి శ్రీదేవి, మరియారత్నం, వెంకటలక్ష్మి, సత్యవతి, దేవుడమ్మ, అమ్మోజి, అప్పల నరస, తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ పోటీల విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించే కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషన పోటీలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని డిఇఒ పిల్లి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సంబంధిత గోడ పత్రికను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రసంస పాత్రలు అందిస్తున్నారన్నారు. ఈ నెల 23వ తేదీలోగా అన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు నమెదు చేసుకోవాలన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉంటాయని, నవంబర్ 1, 2, 3 తేదీలలో పాఠశాల స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు తరగతికి ముగ్గురు చొప్పున మాత్రమే పాల్గొనాలని అన్నారు. పోస్టర్-1 పోటీలకు 9వ తరగతి విద్యార్థులు, పోస్టర్-2 పోటీలకు 8వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. రీల్స్ పోటీలకు 10వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు పాఠశాల స్థాయిలో ప్రతి తరగతి నుంచి క్విజ్, పోస్టర్, రీల్స్‌కు ఇద్దరు చొప్పున విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని, వీరి నుంచి ప్రతి ఈవెంట్‌కు ఇద్దరు చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27న తిరుపతిలో భారతీయ విజ్ఞాన జాతీయ సమ్మేళనంలో జరుగుతాయని, అందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కౌశల్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, కౌశల్ జాయింట్ కోఆర్డినేటర్ పి.మోహన్‌రెడ్డి, ఎపి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.చలపతి, ప్రధానకార్యదర్శి సిహెచ్ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని పి.వెంకటాపురంలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాల తీరుతెన్నులను పరిశీలించారు. విద్యార్థినిలతో ముచ్చటించి వసతి గృహంలోని సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ప్రతిరోజు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహం పరిసరాలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహం భవనాలకు చేపట్టాల్సిన మరమ్మతుల పనులకు సంబంధించి ప్రతిపాదనలను పంపించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎంపిడిఒ సతీష్, తహాశీల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి, ప్రిన్సిపల్ సిహెచ్.మేరిగ్రేస్ పరిమళ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు రికార్డుల అందజేత

ప్రజాశక్తి - రౌతులపూడి

డిఎస్‌సిలో విజేతలుగా నిలిచి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన 40 మంది ఉపాధ్యాయులకు యుటిఎఫ్ మండల శాఖ నాయకులు వారికి అవసరమైన రికార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వైద్యుల సమ్మెకు మద్దతుగా మంగళవారం 104 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు రామ్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు చ చేస్తున్న సమ్మెకు తమ సంఘీభావాన్ని తెలిపారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఒఎల నూతన మండల కమిటీ ఎన్నిక



విఒఎల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గండేపల్లి

మండల విఒఎల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విఒఎల మహాసభ అమ్మాజీ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఇ.చంద్రావతి మాట్లాడుతూ విఒఎల ఖాతాలో జీతాలు జమ చేయాలని, కనీస వేతనాలు సాధించుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్షురాలుగా కృష్ణవేణి, కార్యదర్శిగా అమ్మాణి, ఉపాధ్యక్షులుగా దుర్గాదేవి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీకుమారి, రమ్య, కోశాధికారి గౌరీ, కార్యవర్గ సభ్యులుగా మరికొంతమందితో ఎన్నికైంది.

బౌద్ధంతో శాంతి, సమానత్వం



ప్రజాశక్తి - తాళ్ళరేవు

సమాజంలో శాంతి, స్వేచ్ఛ, సమానత్వం పరిడవిల్లేందుకు బౌద్ధం దోహద పడుతుందని పలువురు బుద్ధిస్టులు అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ధమ్మ దీక్ష దినోత్సవ కార్యక్రమం జరిగింది. త్రిరత్న బౌద్ధ ధమ్మ సొసైటీ, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పంచశీల పతాక ఆవిష్కరణ, బుద్ధ వందనం చేసి సభ ప్రారంభించారు. ధమ్మ సొసైటి అధ్యక్షులు జక్కల ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన దీక్ష కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, కాకినాడ బుద్ధ విహార్ అధ్యక్షులు కోరుకొండ బాబ్జి, లైఫ్ లైన్ హాస్పిటల్ ఎండి, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు కె.భానుమతి, బౌద్ధ ప్రచారకులు పొలుగుమాటి నరసింహమూర్తి, గుత్తాల శ్రీరాములు, కాశి రామారావు, నేలపూడి పెద్దిరాజు మాట్లాడారు. సమాజ హితానికి గౌతమ బుద్ధుడు ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు అంబేద్కర్‌ను బౌద్ధం స్వీకరించడానికి దోహదం చేశాయన్నారు. గతంతో పోల్చితే బౌద్ధం అనుసరించే వాళ్ళ సంఖ్య గణనీయంగా పెరగడం ఆశాజనకమని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన బౌద్ధ ప్రచార గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గిడ్ల వీరప్రసాద్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, టిడిపి మండల అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, గుత్తా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అవకతవకలపై విచారణ చేయాలి



ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి - కరప

మండలంలోని కూరాడ గ్రామంలో డ్వాక్రా రుణాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని పలువురు మహిళలు ఎంపిడిఒ సలాది వెంకట శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో 106 డ్వాక్రా గ్రూపులు వేళంగి ఎస్‌బిఐ పరిధిలో ఉన్నాయని తెలిపారు. 85 గ్రూపులకు ఎస్‌బిఐ మొబైల్ కరస్పాండెంట్‌గా చిన్నం ప్రియభారతి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి సొమ్మును తిరిగి చెల్లించే క్రమంలో ఆమె చేతితో రాసిన రసీదులు ఇచ్చేవారని తెలిపారు. అయితే బ్యాంకు పుస్తకాల్లో ఆ చెల్లింపులు నమోదు కాలేదని, ఇటీవల బ్యాంకు నుంచి తీసుకున్న స్టేట్‌మెంట్లలో తమ చెల్లింపులు జమ కాలేదని తేలిందన్నారు. తక్షణమే సంబంధిత వ్యక్తిపై విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు ఉప్పు మణి, వి.ఉమావెంకటరత్నకుమారి, వి.సూర్యకుమారి, శివనేని అనంతలక్ష్మి, వెలుగుబంట్ల చంద్రలేఖ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో గల శృంగారం వల్లభ స్వామి నిత్య అన్నదాన ట్రస్ట్‌కు విశాఖపట్నం వాస్తవ్యులు బుడ్డేపు లక్ష్మిపార్వతి ఒక లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబానికి ఆలయ కార్యనిర్వాహనాధికారి వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



సదస్సులో మాట్లాడుతున్న కౌన్సిలర్ దుర్గారాణి

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం మండలంలోని వాకతిప్పలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి 'బాలికగా నాతోనే మార్పు - రండి ముందుకు' అనే అంశంపై అవగాహన కల్పించారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అలందజేశారు. అలాగే మండలంలో పలు పాఠశాలలలో బాలికలకు వ్యాసరచన పోటీలు, ఆటపాటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.సారమ్మ, పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం సిహెచ్‌వివి.కృష్ణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ మీనాకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - కాకినాడ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ మనీష, ఆర్‌డిఒలు ఎస్ మల్లిబాబు, ఎం.శ్రీరమణిలతోపాటు పలువురు జిల్లా అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉపాధి

ప్రజాశక్తి - కాకినాడ

గూగుల్ డేటా సెంటర్ రాకతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగువుతాయని ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పెట్టుబడులను తీసుకొస్తుందన్నారు. ఆనాడు హైదరాబాదును ఐటీ హబ్‌గా మార్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు దూర దష్టితో చంద్రబాబు మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తు చేశారు. నేడు చంద్రబాబు సారథ్యంలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో ఆంధ్ర రాష్ట్రం డిజిటల్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దీపావళిలో తగిన జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవడానికి ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలో ఆటో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో బాణసంచా తయారీ, నిల్వ చేయడం వంటివి చేయరాదని అన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినది కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాదా గంగమ్మ(75)కు ఇద్దరు కుమారులు. వేమగిరి గ్రామంలో చిన్న కుమారుడు వద్ద ఉంటుంది. మంగళవారం ఉదయం నర్సరీ కూలి పనుల నిమిత్తం వేమగిరి నుంచి కడియపులంక కాలినడకన బయలు దేరింది. మార్గమధ్యంలో తెలిసిన వ్యక్తి పోతుల సత్య నారాయణ తారసపడడంతో కడియపులంక వరకు బండి ఎక్కింది. కడియపులంక వద్ద హైవే దాటు తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సత్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజ మ హేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడియం మహిళా ఎస్ఐ ధనలక్ష్మిప్రసన్న కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమకు చెందిన దొడ్డి నాగు(38) లారీ డ్రైవర్గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం బావాగారు మరణించడంతో మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరాడు. యర్నగూడెం వద్దకు చేరుకోగానే లారీ వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరోవ్యక్తిని హైవే అంబులెన్స్లో రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. నాగు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు

చర్చిలో చోరీ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సమీపంలో గల కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో షాలోమ్ ప్రార్థన మందిరంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చర్చి తలుపులు బద్దలు కొట్టి సుమారు రూ.లక్ష విలువైన మైక్ సెట్ బాక్సులను దొంగిలించారు. మంగళవారం ఉదయం చర్చి సభ్యులు వచ్చి చూడగా తలుపు తాళాలు పగుల గొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించగా చోరీ జరి గినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమిచ్చారు.

పెళ్లి పేరుతో మోసం

ప్రజాశక్తి - సీతానగరం

పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన ఘటన రాజంపేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజంపేటకు చెందిన పిల్లా సాయిఅన్నపూర్ణకు ఏడు నెలల క్రితం షేర్ చాట్ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వెలుగులి గ్రామానికి చెందిన చిట్టి పైడిరాజు అనే ఒక యువకుడు పరిచయమయ్యాడు. మూడు నెలల క్రితం అతను రాజంపేటలోని అన్నపూర్ణ ఇంటికి వచ్చాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె వద్ద దాచుకున్న రూ.5లక్షలు తీసుకున్నాడు. అంతేకాకుండా అన్నపూర్ణ మేనకోడలికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, మరో రూ.2 లక్షలు, తర్వాత రూ.లక్షతో పాటు మూడు కాసుల బంగారాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. మేనకోడలికి మెడికల్ టెస్టులు చేయించాలని చెప్పి ఆమెతో రెండుసార్లు తిరుపతి, హైదరాబాద్లకు తీసుకెళ్లాడు. అనంతరం, కాల్ లెటర్ ఇంటికి వస్తుందని చెప్పాడు. సెప్టెంబర్ 18న ఆమె మేనకోడల్ని, మరో యువకుడిని విజయవాడలో ఉద్యోగంలో జాయిన్ చేయడానికి తీసుకుని వెళతానని చెప్పాడు. అక్కడ నుండి ఫోన్ మాట్లాడటానికి కుదరదని, తాను వారిని దింపేసి తిరిగి వస్తానని చెప్పి ఉడాయించాడు. అన్నపూర్ణ మేనల్లుడికి జాబ్ ఇప్పిస్తానని చెప్పి రూ.40వేలు తీసుకున్నాడు. ఈ యువకుడు మరో మహిళ నుంచి కూడా ఉద్యోగం పేర రూ.50వేలు తీసు కున్నట్టు తెలిసింది. రాజమండ్రి కాంప్లెక్స్లో యువ కుడిని పట్టుకుని 112కి సమాచారం అందించారు. ప్రకాశ్నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, యువకుడిని సీతానగరం పోలీసులకు అప్పగించారు. బాధితురాలు అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అప్పు చెల్లించమన్నందుకు హత్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమని అడిగినందుకు కుటుంబసభ్యులు హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో డిఎస్పి శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సిఐ బి.సూర్యఅప్పారావు తెలిపిన వివరాల ప్రకారం...గత కొంతకాలంగా ఏలేశ్వరంలో నివాసముంటున్న అడ్డతీగల మండలం డి కొత్తూరుకు చెందిన జీడి పిక్కల వ్యాపారి బొదిరెడ్డి వెంకటరమణ(60) ఈ నెల 2వ తేదీ ఇంటి నుంచి కనిపించడం లేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బైటకు వచ్చాయి. ఏలేశ్వరం గొల్లల మెట్టకు చెందిన రాజా రమేష్ అనే యువకుడు కోడి పందేలకు కోళ్ళు పెంచడమే కాకుండా వీరిని పందాలు ఆడేవాడు. మృతుడు వెంకటరమణకు కోడిపందేలు ఆడే వ్యసనం ఉండటంతో రాజా రమేష్తో స్నేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మృతుడు వెంకటరమణ రాజా రమేష్కు రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి తన సొమ్ము చెల్లించాలని రాజా రమేష్పై మృతుడు ఒత్తిడి తీసుకురావడంతో పథకం ప్రకారం హత్య చేశాడని తెలిపారు. ఈనెల రెండో తేదీన విజయవాడకి నర్సీపట్నంలో కోడిపందాలు ఆడుతారని మృతునికి రాజా రమేష్ నమ్మబలికి కారులో తీసుకెళ్లాడు. ముందే వేసుకున్న పథకం ప్రకారం మృతునికి కూల్ డ్రింక్లో మత్తుమందు కలిపి ఇచ్చారు. స్పృహ కోల్పోయాడని నిర్ధారించుకున్న విశాఖ జిల్లా కోటవురట్ల మండలం బోదిగాల్ ఘాట్ రోడ్డు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి నిర్మానుష్య ప్రదేశంలో బండ రాళ్లతో కొట్టి చంపేశారు. అనంతరం మృతుని ఒంటిపై గల రూ.15 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు తీసుకుని ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చేసి ఆభరణాలను రూ.10 లక్షలకు తాకట్టు పెట్టి వేరే అప్పులు తీర్చుకున్నాడు. పోలీసుల విచారణ చేస్తున్న విషయాన్ని గమనించిన నిందితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతని సోదరుడు ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొంది సోమవారం తిరిగి వచ్చాడు. పోలీసులు అతని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు నిజం వెలుగు చూసింది. నిందితుడిని వైద్య పరీక్ష అనంతరం కోర్టుకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు.

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



సదస్సులో మాట్లాడుతున్న అధికారి దివ్యశ్రీ

మెట్ట ప్రాంత రైతులు ఉద్యానవన పంటల ద్వారా అధికాదాయం పొంద వచ్చని ఆచార్య రంగా విశ్వ విద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రవరం గ్రామంలో ఉద్యానవన అధికారి కె దివ్యశ్రీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలతో రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. ఉద్యానవన పంటల యాజమా న్యంపై ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ జీవన ఎరువుల వాడకం, పంటలు పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి సారవంతంపై మెళుకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, కూటమి నాయకులు బస ప్రసాద్, మైరాల కనకారావు, తోట వెంకటేశ్వర రావు, బండారు సూరిబాబు, బి మణికంఠ, విహెచ్ఎ మనోజ్, రైతులు పాల్గొన్నారు.

బిసి రెసిడెన్షియల్ స్కూల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప


విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్

స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ను మంగళవారం తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాలు, తరగతి గదులు, వసతి గృహం, వంటశాలలను ఆయన పరిశీలించారు. విద్య, వసతి, భోజన సదుపాయాలపై సమగ్రంగా ఆరా తీశారు. విద్యార్థులను సౌకర్యాల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. బెడ్స్ కావాలని, ఫ్యాన్లు మరమ్మతులు చేయించాలని, డోర్లు ఏర్పాటు చేయాలని, స్పోర్ట్స్ పరికరాలను ఇవ్వాలని, ప్లే గ్రౌండ్ వర్షంతో నిండిపోతుందంటూ విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ కెవి.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ


ఎంఎల్ఎకు పుష్పగుచ్ఛం అందిస్తున్న లైబ్రేరియన్లు

నగరంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని పలు గ్రంథాలయాలకు చెందిన లైబ్రేరియన్లు ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి, మూతబడిన గ్రంథాలయాలు తెరిపించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్ఛార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ కె.కిషోర్, పలు గ్రంథాలయాల లైబ్రేరియన్లు ములంపాక శ్రీనివాసరావు, అంబటి వెంకటనారాయణ, కాటం రమేష్బాబు, తదితరులు పాల్గొన్నారు.

పూడుకుపోయిన డ్రెయినేజీ

ప్రజాశక్తి- పెద్దాపురం


డ్రెయినేజీ పూడికపోవడంతో రోడ్డుపై మురుగునీరు

స్థానిక అంకయ్యపేటలోని బసవేశ్వర స్వామి గుడి వీధి డ్రెయిన్ పూడికతో నిండిపోయింది. దీంతో మురుగునీటి ప్రవాహం నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు పెరిగిపోయి కంటి మీద కునుకు లేకుండా పోతుందని, తక్షణమే అధికారులు స్పందించి డ్రెయిన్లో పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్లెక్సీ ధ్వంసంపై ఉద్రిక్తత

ప్రజాశక్తి - గోపాలపురం


నిరసన తెలుపుతున్న రమేష్బాబు అభిమానులు

మండలంలోని వెంకటయపాలేనికి చెందిన వైసిపి సీనియర్ నాయకుని ఫ్లెక్సీను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించి వేయడంతో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసిపి సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శి దుగ్గిరాల రమేష్బాబు పుట్టినరోజు సందర్భంగా వెంకటాయపాలెంలో అభిమానులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని చించేశారు. దీంతో వైసిపి నాయకులు, ఆయన అభిమానులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఫెక్సీని చించిన వారిని అరెస్టు చేయాలని నినదించారు. ఎస్ఐ పి.మనోహర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫ్లెక్సీని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నాయకులు కార్యకర్తలు శాంతించారు. ఫ్లెక్సీని ధ్వంసం చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సాలి వేణు, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటరమణ, మణికంఠ, తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ

- తల్లీ, కూతురుని అదుపులో తీసుకున్న పోలీసులు
- కొవ్వూరు ముత్తూట్ ఫైనాన్స్ లో వెలుగు చూసిన ఘటన

ప్రజాశక్తి - కొవ్వూరు

నకిలీ బంగారం వస్తువులను ముత్తూట్ ఫైనాన్స్లోకి తీసుకువెళ్లి కుదువ పెట్టి సొమ్ములు నొక్కేద్దామనుకున్నా తల్లి కూతుళ్లు పోలీసులకు చిక్కారు. కొవ్వూరు పట్టణంలో రాయుడు హాస్పిటల్ వీధిలో కొత్తపల్లి ఝాన్సీ ఆమె కుమార్తె బిక్కి శ్వేత బుధవారం నకిలీ బంగారం తీసుకుని ముత్తూట్ ఫైనాన్స్కి వెళ్లారు. 56.3 గ్రాముల బరువైన ఏడు గాజులు ఒక చైన్ను తీసుకెళ్లారు. బంగారం తనఖాపై రుణం కావాలని అడిగారు. వస్తువులను పరీక్షించగా అవి నకిలీవని తేలింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ పి.నాగలక్ష్మి కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎఎస్ఐ గూడపాటి శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని పామర్రు గ్రామంలో దేవరపల్లి సత్యవతి ఇంటో గత నెలలో చోరీ సంఘట నలో ఇద్దర్ని అరెస్ట్ చేసినటు కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా మంగళవారం తెలిపారు. తాళ్ల పొలం గ్రామానికి చెందిన పప్పుల ప్రభు కుమార్, ద్రాక్షారామ నున్న వారి వీధికి చెందిన కోడూరి వెంకటేష్ అనే ఇద్దరిని రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్స్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ చేయబడిన బం గారం ఉంగరం , ఇత్తడి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కరప పిఎస్పరిధిలో అరట్లకట్ట గ్రామంలో ఇంట్లోకి ప్రవేశించి బంగారపు చైన్ చోరీ కేసులో పై ఇద్దరు నిందితులని అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 12 గ్రాముల బంగారపు చైన్ను స్వాధీనపరుచుకున్నారు. నింది తులను రామ చంద్రపురం కోర్టులో హాజరుపరిచి కేసును కె.గంగవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిఎస్టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు పెంకే వెంకటేష్ ఆధ్వర్యంలో జిఎస్టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముసిరెడ్డి శ్రీరాములు, పెంకె వెంకటేష్, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

కోటి సంతకాల ఉద్యమం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వైసిపి కోటి సంతకాల ఉద్యమ కార్యక్రమాన్ని మంగళవారం వైసిపి సీనియర్ నాయకులు నక్కా రాజబాబు ఆధ్వర్యంలో రాజవోలు గ్రామంలో నిర్వహించారు. ఇందులో భాగంగా రచ్చబండను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో తూర్పు గోదావరిజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు పెట్టారు. కేంద్ర ప్రభుత్వంపై పలువురు నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వికలాంగునికి ఫిజియోథెరపీ సేవలందిస్తున్న వైద్యులు

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ విఆర్కె.చౌదరి సూచించారు. మంగళవారం ఆయన భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర వైకల్యం కలిగిన బాలలకు ఈ ఫిజియోథెరపీ సత్ఫలితాలు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాల హెచ్ఎం కె.పద్మశ్రీ, ఫిజియోథెరపిస్టు డాక్టర్ అపర్ణ, భవిత కేంద్రం సిబ్బంది బి.దుర్గాప్రసాద్రెడ్డి, బి.ఆనందరావు, బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సత్యసాయిహైస్కూల్కు వెళ్లే రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

పలు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో సోమవారం అర్ధరాత్రి, మంగళవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు నీట మునిగాయి. పరదేశమ్మ పేటలోని పాత స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న సాయి నగర్ పూర్తిగా నీట మునగడంతో ఆ ప్రాంతంలో ఉన్న సత్యసాయి హైస్కూల్లోకి వర్షపు నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాళ్ళరేవు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రయినేజీ లేకపోవడంతో రోడ్డు మీద వర్షపు నీరు ప్రవహించిందని సత్యసాయి హైస్కూల్ కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణవర్మ అన్నారు. పరదేశమ్మ వీధి పూర్తిగా నీట మునగడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మాధవరాయునిపేట, శ్రీరామ నగర్ రహదారులపై వర్షం నీరు ప్రవహించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


సిఐకి వినతిపత్రం ఇస్తున్న తోట నరసింహం, ఇతర నాయకులు

నకిలీ మద్యంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి - జగ్గంపేట

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయం నుంచి పోలీస్స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐ వైఆర్కె.శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం మాట్లాడుతూ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - కరప, పెదపూడి


కరపలో మాట్లాడుతున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బాణసంచా విక్రయదారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. లైసెన్సు పొందిన వ్యాపారులు బాణసంచాను విక్రయించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షాపుల వద్ద అగ్ని నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఉంచాలన్నారు. షాపుల మధ్య తగిన భౌతిక దూరం పాటించడం, ప్రమాద నివారణ చర్యలను అమలు చేయాలన్నారు. బాణసంచా విక్రయాలు, తయారీకి సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పెదపూడి ఎస్ఐ తులసీరామ్ సూచించారు. మంగళవారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ బాణసంచా ఎక్కడైన నిల్వ ఉంచిన, రవాణ చేసిన ఆ సమాచారం తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలను పాటించకపోతే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S. No. 70/2018

Between:

వాది: శ్రీ యలమాటి మోహనరావు, S/o. వెంకట రత్నం, వయస్సు 65 సం॥లు, హిందూ, పురుషుడు, వ్యవసాయం, డో.నెం. 4-20, పశివేదల, కొవ్వూరు మండలం,

AND

ప్రతివాదు:

1. శ్రీ చెరుకూరి వెంకటేశ్వరరావు, S/o. లేటు వెంకటరావు, వయస్సు 59 సం॥లు, హిందూ, పురుషుడు, వ్యాపారం, డో.నెం. 23-14-4/1ఎ, శ్రీరామ్ నగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా.
2. శ్రీమతి ఓరుగంటి నీలిమ, W/o. సుధీర్, హిందూ, వయస్సు 25 సం॥లు, స్త్రీ, గృహిణి, C/o. ఓరుగంటి సూర్యారావు, Behind City Cable Office, కొవ్వూరు.
3. శ్రీమతి చెరుకూరి నాగకుమారి, W/o. వెంకటేశ్వరరావు, వయస్సు 59 సం॥లు, హిందూ, స్త్రీ, గృహిణి, డో.నెం. 3-14-14/1ఎ, శ్రీరామ్నగర్, రాజమండ్రి.
4. శ్రీ చెరుకూరి వీరేంద్రనాథ్, S/o. వెంకటేశ్వరరావు, వయస్సు 26 సం॥లు, హిందూ, వ్యాపారం, పురుషుడు, డో.నెం. 23-14-14/1ఎ, శ్రీరామ్ నగర్, రాజమండ్రి.

యీ నెంబరు దావాలో 2వ ప్రతివాదికి దావా సమను కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్ పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించిననూ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది. యీ నెంబరులో 2వ ప్రతివాది అయిన శ్రీమతి ఓరుగంటి నీలిమ, W/o. సుధీర్, కొవ్వూరు అనువారు **ది. 28-10-2025వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 28-10-2025

CH.NAGA KUMAR, Advocate
Kovvuru Kovvuru, E.G.Dist.,
Dt: 11-10-25 Cell: 9440985149

లింకు డాక్యుమెంట్ పోయినవి

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన దువ్వాపు శ్రీనివాసరావు తండ్రి ముత్తయ్య అను నాకు వేగేశ్వరపురం రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ చేయబడిన దస్తావేజు నంబర్ 2907/2010 కలవు. సదరు లింక్ డాక్యుమెంట్ నెంబర్ 502/ 2014 కూడా ఇచ్చి ఉన్నారు. పైడి మెట్ట గ్రామం డోర్ నెంబర్ 5-79 సమీపంలో గల 100 చదరపు గజాల ఖాళీ స్థలం కలదు. ఈ స్థలము యొక్క డాక్యుమెంట్స్ నేను జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి తాళ్లపూడి మెయిన్ రోడ్డు కు తీసుకువెళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ అడ్రస్ కి తెలియజేయగలరు.

దువ్వాపు శ్రీనివాసరావు.
S/o ముత్తయ్య.
డోర్ నెంబర్ 5-79, పైడిమెట్ట గ్రామం.
తాళ్లపూడి మండలం. తూర్పుగోదావరి జిల్లా.
ఫోన్ నంబర్.9490832713.

పాసుపోర్టు పోయినది

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామానికి చెందిన తూము సునీల్ కార్తీక్ S/o. వెంటాచలం అను నాకు సంబంధించిన **G 5818984** నెంబరు గల పాసుపోర్టు ను తీసుకుని మా ఇంటి దగ్గర నుండి కిర్లంపూడి సెంటర్లోని ఆన్లైన్ సెంటర్ కు వెళ్తుండగా మార్గమధ్యంలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పోయినది. దొరికినవారు క్రింది అడ్రస్ కు ఫోన్ చేసి అందివ్వగలరు.


నా అడ్రస్
తూము సునీల్ కార్తీక్,
S/o. వెంటాచలం, డోర్ నెంబర్ 8-12,
తూమువారి వీధి, కిర్లంపూడి, కిర్లంపూడి
మండలం. ఫోన్ నెంబర్: 9848970979

లింక్ దస్తావేజు పోయినది

నా ఒరిజినల్ రిజిష్టర్డ్ లింకు దస్తావేజు **నెం.1513/1997** తేది.**03-07-1997** యస్.ఆర్.ఓ. రాజానగరంలో రిజిష్టర్డు అయినది. సదరు దస్తావేజును మా ఇల్లు రాధేయపాలెం గ్రామం నుండి యం.ఆర్.ఓ. ఆఫీసు రాజానగరంకు ప్లాస్టిక్ కవర్లో పెట్టుకుని, నామోటారు సైకిల్ హుక్కు తగిలించుకొని వెళ్ళుచూ నేను యం.ఆర్.ఓ. ఆఫీసు రాజానగరం చేరుకునే సరికి మార్గమధ్యంలో పడిపోయినది ఎవరికైనా దొరికినచో నాకు స్వయంగా అందచేయండి లేదంటే నా సెల్ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వండి.

ప్రగడ శ్రీనివాసరావు
డోర్నెం.1-83, రాధేయపాలెం,
రాజానగరం(మం)
సెల్ నెం.9505578457

యానాం వార్తలు


నివాళులర్పిస్తున్న నాయకులు

బుద్ధుని బోధనలు అనుసరించాలి

ప్రజాశక్తి - యానాం

బుద్ధుని బోధనలు అనుసరణీయమని దళిత నాయకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న నాగ్పూర్లోని దీక్షాభూమిలో లక్షలాది మందితో ధమ్మదీక్ష స్వీకరించిన రోజును పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్లో అంబేద్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ నగర్లోని బుద్ధా పార్కులో బుద్ధ వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాటిపాక దుర్గబాబు బుద్ధవందనం కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ హేతుబద్ధమైన బౌద్ధంను అంబేద్కర్ స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నామాడి అప్పారావు, గిడ్డి బలరాం, మట్టా శ్రీనివాసు, గుర్రపు ప్రహ్లాదుడు, ఇసుక పట్ల పాపారావు, ముర్రే మీరా సాహెబ్, పోలిమారి మహేష్, కోరుకొండ రాజేంద్రప్రసాద్, హరిబాబు, యాళ్ల వెంకట కుమార్ పాల్గొన్నారు.

మంగళ, శుక్రవారాల్లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

ప్రజా సమస్యలు, అనుబంధ అంశాలపై ప్రజల నుంచి వినతులను ప్రతీ మంగళ, శుక్రవారాల్లో స్వీకరించనున్నట్లు పరిపాలనాధికారి అంకిత్కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుండపోత వర్షం...


మురుగునీటిలో స్కూల్కు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

యానాంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పిల్లరాయ వీధి, సుబ్రహ్మణ్య భారతి వీధి, విష్ణాలయం వీధి, చింతావారి వీధి, జిక్రియనగర్లో రోడ్లపై భారీగా వర్షపు నీరు ప్రవహించింది. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యానాం పోలీస్స్టేషన్, ఎస్టిపిపి జూనియర్ కళాశాల, పిల్లరాయ స్వామి ఆలయంలోకి వర్షం నీరు చేరింది.

వర్షం వచ్చిన ప్రతిసారి ఇబ్బందులే...

రోడ్లు, డ్రయినేజీలు లేక వర్షం వచ్చిన ప్రతిసారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మట్టా, పెనుపోతు గార్డెన్ల చుట్టు పక్కల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం తగ్గిన 10 నుంచి 15 రోజులపాటు ఆ నీటిలోంచి వెళ్ళవలసి వస్తుందని, స్కూల్ పిల్లలు, ఇతర పనులకు వెళ్లే వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్ ఆ గ్రామాన్ని సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని దినేష్ డిమాండ్ చేశారు.

IN THE COURT OF HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION) RAMACHNADRAPURAM

I.A.No.287/2025 in O.S.No.226/2020

Between:-

తవిటికి ప్రేమ్ కుమార్ ...పిటీషనర్ /డిఫెండెంట్-3

And

1. దేవిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు, తండ్రి, నాగేశ్వరరావు, ఇంటి నెం.7-92, పెద్దనూతివీధి, అర్తమూరు-533308,మండపేట మండలం ...రెస్పాండెంట్-1/డిపెండెంట్-1
2. దేవిశెట్టి మాణిక్యాంబ,భర్త.సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఇంటి నెం. 7-92, పెద్ద నూతి వీధి, అర్తమూరు-533308,మండపేట మండలం ...రెస్పాండెంట్-2/డిపెండెంట్-4

పై దావా గ్రంథంలో మీరు ఓ.ఎస్.నెంబరు 226/2020లో ఐ. ఏం.నెం.287/2025 లో రెస్పాండెంట్-1&2 లుగా ఉన్నారు. మీకు రిజిష్టర్ పోస్టు ద్వారా, కోర్టు వారి ద్వారా ఎన్ని సార్లు సమన్లు పంపినా తీసుకోవడం లేదు. గౌ. కోర్టు వారి ఆదేశానుసారం ఈ రోజు పేపర్ ద్వారా ఈ సమన్లు ప్రకటన చేయడమైనది. మీరు ఇరువురూ **ది.27-10-2025వ** తేదీన ఉదయం**10.30గంటలకు** పై కోర్టు కు హాజరై మీ సంజాయిషీ ఇవ్వవలసినదిగా కోర్టు వారు ఆదేశించి ఉన్నారు. లేని ఎడల మీ పరోక్షమున ఐ.ఏ. తీర్మానించడం జరుగుతుంది.

వాయిదా తేది:27-10-2025

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

టి.వి.గోవిందరావు,ఎం.ఏ.ఎల్.ఎల్.బి.,
టి.ఆర్.లక్ష్మి ఎం.ఏం.ఎల్.ఎల్.బి.,
ఎస్.వి.బి.లాఛాంబర్,
సత్యశ్రీ రోడ్, మండపేట-533308

వేలం ప్రకటన

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.1/2019 In O.S.73/2015

Between:-

సంగాని శ్రీనివాసరావు ...D.Hr

మరియు

రేవు సత్యనారాయణ ...J.Dr

పై నెంబర్ అమలు గ్రంథం లో D.Hr కి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం J.Dr తాలుకు షెడ్యూల్ ధాఖలా స్థిర ఆస్తిని కోర్ట్ వారి ఇస్తిహారు షరతులుకు లోబడి **ది.03-11-2025తేది** ఉదయం **గం.10.30** నిమిషములు నుండి వేలం కాబడును. ఆసక్తి కలవారు పై కోర్ట్ వారి ఎదుట హాజరై పాడుకోన వచ్చును వివరముల కొరకు పై కోర్ట్ నజారత్ నందు కాని D.Hr అడ్వొకేట్ గారి ఆఫీస్ నందు కాని తెలుసుకోవలెను

షెడ్యూలు

Dr.B.R. అంబేద్కర్ కొనసీమ జిల్లా (పూర్వం తూర్పు గోదావరి జిల్లా) ఐ.పోలవరం SRO, ఐ.పోలవరం మండలం G.మూలపోలం శివారు యర్రగరువు, G.వేమవరం రెవిన్యూ గ్రామం జిరాయితీ మెరక పల్లం **R.S. No.480/5 Ac.0-50** సెంట్లుకు హద్దులు

తూర్పు:- మెల్లం సింహాచలం గారి ఆస్తి, **దక్షిణం:-** K.లోవరాజు గారి ఆస్తి, **పడమర:-** మోర్త ప్రభుదాస్ గారి ఆస్తి, **ఉత్తరం:-** మెల్లం సింహాచలం గారి ఆస్తి

ఈ హద్దుల మధ్య గల Ac.0-50 సెంట్లు జిరాయితీ మెరక పల్లం మామూలు నీటి మార్గములు ఈజ్మెంట్ హక్కులు సర్వం సహా.

D.Hr Value: రూ. 5,00,000-00
Amin Value: రూ. 5,00,000-00

(శ్రీ కోర్టు వారి అనుమతిన)

జి.వి.రామారావు
అడ్వకేట్, ముమ్మిడివరం, ఫోన్. 9290286024